సాక్షి ఒడిశా
శనివారం । 27 । ఏప్రిల్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2.82.810లు, బంగారం 1 గ్రాము ,వెండి 16 గ్రాముల 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



గజపతి నారాయణకు నివాళులు

స్వతంత్ర ఒడిశా నిర్మాత గజపతి నారాయణ జయంతి ఘనంగా నిర్వహించారు. నాయకులు హాజరై నివాళులర్పించారు.

- 8లో



వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం

జయపురంలో శ్రీరామ పట్టాభిషేకం ఘనంగా జరిగింది. ఉత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

జయపురంలో ఎన్నికల పరిశీలకుల పర్యటన



ఎ.విక్రమదేవ్ విశ్వవిద్యాలయంలో స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న ప్రియాంక గోస్వామి

జయపురం: సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. మే 13వ తేదీన ఒడిశాలో ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో భాగంగా కేంద్ర ఎన్నికల కమిషన్ జయపురం జిల్లాకు పరిశీలకురాలుగా నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రియాంక గోస్వామి శుక్రవారం ఇక్కడకువచ్చారు. విక్రమదేవ్ విశ్వవిద్యాలయంలోని నూతన భవనంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలు, ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాట్‌లను పరిశీలించారు. అనంతరం జయపురం సమితి ఉమ్మిరి గ్రామ పంచాయతీ ఉమ్మరిలో పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం జయపురం పట్టణంలోని మూడో నంబర్ వార్డు పరిధి ఇరిగేషన్ కాలనీలోని ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని కూడా సందర్శించారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు సమకూర్చాలన్నారు. ఆమెతోపాటు మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, జయపురం బీడీవో శక్తి మహాపాత్రో, ప్రభుత్వ ఇంజినీర్ విశ్వనాథ్ పాత్రో ఉన్నారు.

జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో.. నామినేషన్ల పరిశీలన పూర్తి



అభ్యర్థుల సమక్షంలో నామినేషన్లను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి

పర్లాకిమిడి: జిల్లా కేంద్రం పర్లాకిమిడిలోని కలెక్టరేట్, సబ్‌కలెక్టర్ కార్యాలయంలో 2024 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రిటర్నింగ్ అధికారి సమక్షంలో అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన శుక్రవారం జరిగింది. బరంపురం పార్లమెంటరీ పరిధిలోని రెండు నియోజికవర్గాలు మోహనా (ఎస్టీ)కి 8 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా అన్నీ పత్రాలు సక్రమంగా ఉన్నట్టు రిటర్నింగ్ అధికారి బిరేంద్ర కుమార్ దాస్ తెలియజేశారు. బీజేడీ నుంచి అంతర్యామి గోమాంగో, కాంగ్రెస్ నుంచి దాశరథి గోమాంగో, బీజేపీ నుంచి ప్రశాంత కుమార్ మల్లిక్ బరిలో ఉన్నారు. పర్లాకిమిడి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 11 మంది నామినేషన్లు చేయగా అన్ని నామినేషన్లు సక్రమంగా ఉన్నట్టు రిటర్నింగ్ అధికారి అనూప్ పండా తెలిపారు. ఎన్నికల బరిలో కాంగ్రెస్ నుంచి బిజయకుమార్ పట్నాయక్, బీజేడీ నుంచి రూపేష్ పాణిగ్రాహి, బీజేపీ నుంచి కోడూరు నారాయణరావు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పైల మురళీకృష్ణ, ఆప్ నుంచి మనోజ్ కుమార్ బోడోనాయక్, స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు.


బీజేపీ ఎంపీ ఇంట డ్రోన్ కలకలం



ఎంపీ ఇల్లు, కార్యాలయం ఆవరణలో కూలిన డ్రోన్

భువనేశ్వర్: ఝార్సుగుడ అమదరాహ్ బెలపహాడ్ ప్రాంతం బీజేపీ ఎంపీ సురేష్ పూజారి అద్దె ఇల్లు, కార్యాలయం ప్రాంగణంలో గురువారం అనుమానాస్పద పరిస్థితుల్లో డ్రోన్ కూలింది. ప్రస్తుతం బ్రజరాజ్‌నగర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న సురేష్ పూజారి గైర్హాజరీలో ఈ ఘటన జరిగింది. అతని కార్యాలయంలోని కేర్ టేకర్ ఫోన్‌లో ఈ విషయాన్ని పూజారికి తెలియజేశాడు. ఎంపీ వెంటనే ఎస్పీని సంప్రదించడంతో పోలీసులు రంగంలోకి దిగారు. బెలపహాడ్ పోలీసు ఠాణా ఇంచార్జీ ఐఐసీ నేతత్వంలోని పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి డ్రోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈడ్రోన్ అటవీ శాఖకు చెందినదని ప్రాథమిక విచారణలో పోలీసులు గుర్తించారు. దీనిని ప్లాంటేషన్ సర్వే కోసం ఉపయోగించినట్లు పేర్కొన్నారు. ఝార్సుగుడ ఎస్పీ మాట్లాడుతూ 'ఈ ప్రాంతం బ్రజ్‌రాజ్‌నగర్, బెలపహాడ్ మధ్య ఉంది. ఘటన జరిగిన వెంటనే బెలపహాడ్ ఐఐసీ ఘటనా స్థలికి చేరుకుని డ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్లాంటేషన్ సర్వే చేసేందుకు అటవీ శాఖ డ్రోన్లు ఉపయోగించినట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది' అని స్పష్టం చేశారు. తదుపరి విచారణ కొనసాగుతోందని చెప్పారు.

రెండో దశ ఎన్నికలకు.. నోటిఫికేషన్



- మే 3 వరకు నామినేషన్ పత్రాల స్వీకరణ
- 6 వరకు ఉపసంహరణకు గడువు
- తొలి విడతలో లోక్‌సభకు 75 నామినేషన్లు

భువనేశ్వర్:

రాష్ట్రంలో రెండో దశ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ దశలో బర్‌గఢ్, సుందర్‌గఢ్, బొలంగీర్, కంధమల్, అసికా లోక్‌సభ స్థానాలు, వాటి పరిధిలోని 35 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మే 20న ఈ నియోజక వర్గాల్లో పోలింగ్ జరుగుతుంది. ఈ నెల 26 నుంచి నామినేషన్ దాఖలు ప్రక్రియ ప్రారంభమై మే 3 వరకు కొనసాగుతుంది. మే 4న నామినేషన్ పత్రాలు పరిశీలిస్తారు. మే 6 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు కల్పించారు. కలహండి, నవరంగ్‌పూర్, బరంపురం, కొరాపుట్‌లోని 4 లోక్‌సభ స్థానాలకు, మే 13న దాని పరిధిలోని 28 అసెంబ్లీ నియోజకవర్గాలకు జరగనున్న ఎన్నికలకు గురువారం నామినేషన్ పత్రాల సమర్పణ పూర్తయింది.

రెండో విడత పోలింగ్ వేళలు ఇలా..

- బర్‌గడ్ పార్లమెంటరీ నియోజకవర్గం పదంపూర్ అసెంబ్లీ సెగ్మెంటులో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగు వేళలు కేటాయించారు. మిగిలిన అసెంబ్లీ సెగ్మెంట్లు బిజేపూర్, బర్‌గడ్, అట్టబిరా, భట్లీ, బ్రజరాజ్‌నగర్, ఝార్సుగుడ నియోజక వర్గాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్ సమయం కేటాయించారు.
- సుందర్‌ఘర్ పార్లమెంటరీ నియోజక వర్గం పరిధిలో తాలాసారా, సుందర్‌గడ్, బీరమిత్రపూర్, రఘునాథ్‌పల్లి, రౌర్కెలా, రాజ్‌గంగ్‌పూర్, బొణై శాసన సభ నియోజకవర్గాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు పోలింగు వేళలుగా ప్రకటించారు.
- బొలంగీర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో బీరమహారాజ్‌పూర్, సోన్‌పూర్, లొయిసింగ, బొలంగీర్, టిట్లాగఢ్ అసెంబ్లీ సెగ్మెంట్లకు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ సమయం కేటాయించారు.
- పట్నాగడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో 17 పోలింగ్ స్టేషన్లకు (7, 8, 10, 12, 14, 15, 19, 20, 21, 23, 33, 34, 64, 66, 197, 198, 215) ఓటింగ్ ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, మిగిలిన కేంద్రాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వరకు పోలింగ్ జరుగుతుంది.
- కంటాబంజి శాసనసభ నియోజకవర్గంలో 13 పోలింగ్ కేంద్రాలకు (9, 10, 98, 103, 104, 107, 109, 110, 131, 136, 165, 166, 167) ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, మిగిలిన కేంద్రాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది.
- కంధమల్ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో బలిగుడ శాసనసభ సెగ్మెంట్‌లో 15 (30 నుంచి 44 నంబర్లు) పోలింగ్ కేంద్రాలకు ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, మిగిలిన వాటికి ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. జి.ఉదయగిరి పరిధిలో 8 పోలింగ్ కేంద్రాలకు (65 నుంచి 71, 71ఎ) ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, మిగిలిన వాటికి ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఫుల్బాణి శాసనసభ స్థానంలో 23 పోలింగ్ కేంద్రాలకు (98 నుంచి 120) ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ జరగనుంది. కొంటామల్, బౌధ్ కేంద్రాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 వరకు, దసపల్లా సెగ్మెంటులో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు, భంజనగర్, అసికా ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు పోలింగు వేళలు కేటాయించారు.

లోక్‌సభకు 75 నామినేషన్లు..

- ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి అందిన సమాచారం మేరకు మే 13న తొలి విడతలో ఓటింగ్ జరగనున్న కలహండి, నవరంగ్‌పూర్, బరంపురం, కొరాపుట్ నాలుగు నియోజకవర్గాల్లో విస్తరించి ఉన్న లోక్‌సభ స్థానాలకు 39 మంది అభ్యర్థులు 75 నామినేషన్లు దాఖలు చేశారు.
- కలహండి లోక్‌సభ స్థానానికి 20, నవరంగ్‌పూర్ స్థానానికి 10, బరంపురం స్థానానికి 24, కొరాపుట్‌కు 21 నామినేషన్లు దాఖలయ్యాయి. అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలు చెల్లుబాటు అయ్యేలా చూసుకోవడానికి తరచుగా అనేక సెట్లను దాఖలు చేస్తారు.
- ఈ నియోజకవర్గాల పరిధిలోని 28 అసెంబ్లీ స్థానాలకు గాను 266 మంది అభ్యర్థులు 483 నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగియగా శుక్రవారం నుంచి పరిశీలన ప్రారంభమైంది. అభ్యర్థులు ఏప్రిల్ 29 వరకు నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు గడువు కల్పించారు.
- మే 13, మే 20, మే 25, జూన్ 1 తేదీల్లో ఒడిశాలో 21 మంది లోక్‌సభ సభ్యులు, 147 మంది శాసనసభ్యులను ఎన్నుకునేందుకు ఓటింగ్ జరుగుతుంది. లోక్‌సభకు, అసెంబ్లీకి ఓటు వేసేందుకు వీలుగా ఒడిశా ప్రభుత్వం ఆయా రోజుల్లో ఉద్యోగులకు సెలవు ప్రకటించింది.

వినూత్న నిరసన



వాహనాలను నిలిపి భిక్షాటన చేస్తున్న మహిళలు



ప్లకార్డులు పట్టుకుని భిక్షాటనలో యువకులు

- రహదారి నిర్మించాలని జింజిలిబడి గ్రామస్తుల భిక్షాటన
- సార్వత్రిక ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరిక

రాయగడ: తమ గ్రామానికి సరైన రహదారి లేదు. ఎన్నిసార్లు ఈ స్యమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదు. నాయకుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అందుకే తమ గ్రామానికి రహదారిని నిర్మించుకునేందుకు భిక్షాటన చేస్తూ నిధులు సమకూర్చుకుంటున్నాం. ఇప్పటికైనా అధికారులు, నాయకుల్లో చలనం రావాలన్న ఉద్దేశంతో తమ నిరసనను వ్యక్తం చేస్తున్నామని కొలనార సమితి జింజిలిబడి గ్రామస్తులు తెలిపారు. ఈ గ్రామంలో వందకు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. మెయిన్ రోడ్డు నుండి గ్రామానికి వెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందిపడుతున్నారు. ఈ సమస్యను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంతో గ్రామస్తులంతా కలిసి గురువారం ప్రధాన రహదారిపై వచ్చే వాహనాలను నిలిపి భిక్షాటన చేశారు. దీనివల్ల వచ్చే డబ్బులతో తాము రహదారిని ఏర్పాటు చేసుకుంటామన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను తామంతా బహిష్కరిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. బిసంకటక్ శాసనసభ నియోజకవర్గం పరిధిలోకి ఈ గ్రామ వస్తుందన్నారు. ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరకు ఓటుతో బుద్ధి చెబుతామని వారంతా నినాదాలు చేశారు.

ఘనంగా కృష్ణ చంద్ర గజపతి జయంతి



ఎంకేసీజీప మెడికల్ కళాశాల ప్రాంగణంలోని గజపతి మహరాజ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

బరంపురం: ఒడిశా ప్రజల జన ప్రియ నాయకుడు పర్లా మహరాజ్ కృష్ణ చంద్ర గజపతి అని పలు సంఘాల ప్రతినిధులు కొనియాడారు. కృష్ణచంద్ర గజపతి 132వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాం జిల్లా సుండిక సమా, బహుముఖీ సమాజ్ మంగళ సంస్కృతి కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో బరంపురంలోని విజయ టాకీస్ జంక్షన్‌లో ఉన్న కృష్ణ చంద్ర గజపతి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంకేసీజీ మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఉన్న మహరాజ్ విగ్రహానికి పూల మాలలు వేసి జయంతి ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ప్రత్యేక ఒడిశా రాష్ట్రం ఏర్పాటు చేసేందుకు కృష్ణచంద్ర గజపతి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ప్రత్యేక ఒడిశా ఏర్పడిన తురువాత తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి అభివద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రమేష్ చౌప్ పట్నాయక్, సుభాష్ మహరణ, సుశాంత్ సబత్, కృష్ణ చంద్రదాస్, పింకు దాస్ డాక్టర్ సంత్రోష్ పాత్రో, సుభాష్ భిష్మాచార్య చౌధురి పాల్గొన్నారు.

నిఘా నేత్రాలకు దొరికిపోయాడు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీపీఓ వర్మ, పోలీసు అధికారులు.



నిందితుడు సుధామ్ నాయిక్

- హంతకుడిని పట్టించిన సీసీ కెమెరాలు

జయపురం: టీ కొట్టు యజమాని తంబి అయ్యర్ హంతకుడిని సీసీ కెమెరాలు పట్టించాయి. వీటి సాయంతోనే జయపురం పోలీసులు హత్యజరిగిన 48 గంటల్లో హంతకుడిని పట్టుకోగలిగారు. జయపురం సబ్‌డివిజన్ అధికారి అంకిత కుమార్ వర్మ గురువారం రాత్రి ఈ మేరకు వివరాలు వెల్లడించారు. నిందితుడు సుధామ్ నాయిక్ అని అతడి వద్ద ఒక బైక్, ఒక మొబైల్ ఫోను, రూ.500లు నగదు, హత్యకు వినియోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 23న స్థానిక కొత్తవీధికి చెందిన మనోజ్ నారాజీ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వివరాల ప్రకారం.. 23వ తేదీన టీ స్టాల్ తెరిచేందుకు తాళాలు తెచ్చేందుకు నారాజీ.. తంబి అయ్యర్ ఇంటికి వెళ్లాడు. అయితే ఇంటి నుంచి దుర్గంధం రావడంతో పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఇంటి తలుపులు తీసి చూడగా తంబి మృతదేహం కనిపించింది. దీంతో పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. ఈ విచారణలో తంబి, సుధామ్ నాయక్ మంచి స్నేహితులని గుర్తించారు. సుధామ్‌ది బొరిగుమ్మ సమితి బి.సింగపూర్ పంచాయతీ రనస్‌పూర్ గ్రామం. 2020 నుంచి స్థానిక కోవిడ్ ఆస్పత్రిలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. తంబి తన స్నేహితునిని తరచూ డబ్బులు ఇస్తుండేవాడు. ఇటీవలే ఓ హోండా బైక్ కూడా కొనిచ్చాడు. 2023 లో ఒక హత్య కేసులో సుధామ్‌కు బెయిల్ కూడా ఇచ్చాడు. అయితే ఈ మధ్యన తాను ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వాలని తంబి సుధామ్‌ను కోరగా.. 14వ తేదీన సుధామ్ తంబి ఇంటికి వచ్చాడు. అక్కడ వాగ్వాదం జరిగి గొడవ జరగ్గా సుధామ్ కత్తితో తంబి గొంతు కోసం తలుపులు వేసి పారిపోయాడు. వెళ్తూ వెళ్తూ ఓ పాలిథీన్ సంచిలో చిల్లర నాణేలు కూడా పట్టుకుపోయాడు. అయితే అతను వెళ్తున్న దృశ్యాలు హోటల్ సమీపంలోని సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. హత్యకు వినియోగించిన కత్తిని, తాళపు చెవిని, పాలిథీన్ సంచితో నాణేలను కెనాల్ రోడ్డులోని ఒక హోటల్‌లోని తుప్పల్లో పడేసి బైక్‌పై తన గ్రామానికి వెళ్లిపోయాడు. అయితే సీసీ కెమెరాల్లో అతడి కదిలికలన్నీ నిక్షిప్తం కావడంతో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

గంజాయి రవాణా గుట్టురట్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి, అరెస్టయిన వారితో ఎక్సైజ్ అధికారులు



95 కిలోల గంజాయి, ఆటోను చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

- 540 కిలోల గంజాయి, కారు స్వాధీనం
- ఇద్దరు అరెస్టు

బరంపురం: గంజాయి రవాణా గుట్టు రట్టయింది. కారులో తరలిస్తున్న 540 కిలోల గంజాయిని అబ్కారి శాఖాధికారులు దాడిచేసి పట్టుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరిని అరెస్టు చేసినట్టు అధికారులు వెల్లడించారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు బరంపురం అబ్కారిశాఖాధికారులు హింజికాట్-దిగపండి- బరంపురం మధ్యలోని మూడురోడ్ల కూడలిలో శుక్రవారం నిఘా వేశారు. దిగపండి నుంచి బరంపురం నగరంలోకి అనుమానాస్పదంగా ఉన్న కారు ప్రవేశించగానే ఫస్ట్‌గేట్ వద్ద అధికారులు దాడి చేశారు. కారుని నిలిపివేసి పరిశీలించగా అందులో పది బస్తాల్లో 540 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. దీంతో గంజాయితో పాటు దాన్ని తరలిస్తున్న హూండా సిటీ కారుని స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రం మిధనపూర్ జిల్లాకి చెందిన హరదన బెహరా, బిశ్వాజిత్ దాస్‌లను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ. 24 వేల నగదు కూడా స్వాధీనం చేసున్నామని బరంపురం అబ్కారిశాఖ అధికారులు తెలిపారు.

మరో ఘటనలో 95 కిలోల గంజాయి సీజ్

ఆటోలో అక్రమంగా రవాణా చేస్తున్న 95 కిలలో గంజాయిని స్వాధీనం చేసుకున్నామని బరంపురం ఐఐసీ అధికారి గీతాంజాలి సాహు తెలిపారు. గురువారం ఉదయం కొందమాల్ జిల్లా దరింగబడి నుంచి బరంపురం నగరానికి ఆటోలో గంజాయిని తరలిస్తున్నట్టు ముందుగా అందుకున్న సమాచారం మేరకు బరంపురం ఎక్సైజ్ ప్రత్యేక విభాగం సిబ్బంది నగర చివర బంగినబడి జంక్షన్ సమీపంలో నిఘావేశారు. వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆటోలో తరలిస్తున్న గంజాయిని గుర్తించారు. అందులో ఉన్న 95 కిలోల గంజాయి, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. మిధునపూర్‌కి చెందిన హుమాస్ మహబత్‌ను అరెస్టు చేశారు.

అడుగంటిన గండాహాతి



చుక్కనీటిబొట్టు లేని గండాహాతి జలపాతాలు



కానరాని పర్యాటకులు

పర్లాకిమిడి: రాయగడ బ్లాక్ గంగాబడ పంచాయతీలో ప్రముఖ పర్యాటక స్థలం గండాహాతి జలపాతాలు వద్ద చుక్కనీరు లేకపోవడంతో సందర్శకులు నిరాశ చెందుతున్నారు. ఏటా ఈ సమయంలో కొంత మేర జలాలు ఉండేవి. ఈ సారి అలాంటి పరిస్థితి లేకపోవడం గజపతి జిల్లా రాయఘడ, పర్లాకిమిడిలో నీటిఎద్దడి తీవ్రతకు అద్దం పడుతోందని పలువురు విశ్లేషిస్తున్నారు. మహేంద్రతనయ నుంచి ఇక్కడికి జల ప్రవాహం ఉంటుంది. ప్రస్తుతం నీటి జాడ లేక పర్యాటకులు దూరం కావడంతో రిసార్టు నిర్వాహకులు, టోల్ గేటు నిర్వహిస్తున్న ఫారెస్టు అధికారులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వర్షాలు లేకపోవడంతో రాయఘడ బ్లాక్‌లోని లక్ష్మీపూర్, కోరడాసింగి, లైలై, జల్లంగో, బుర్జంగి పంచాయతీ, చంపంగిపూర్, డోంబాలో తదితర గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొంది.

క్లుప్తంగా

కాంగ్రెస్ గూటికి బీజేపీ నేత



కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ మాజీ అధ్యక్షుడు సాహు, అతడి అనుచరులు.

జయపురం: జయపురం నియోజకవర్గం బొరిగుమ్మలో బీజేపీకి గట్టి షాక్ తగిలింది. బొరిగుమ్మ సమితిలో పేరుగాంచిన యువనేత, బీజేపీ మాజీ అధ్యక్షుడు బిజయనారాయణ సాహు శుక్రవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బొరిగుమ్మ బ్లాక్ కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బిజయ నారాయణ సాహు వందమందికి పైగా తన అనుచరులతో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన 2017 లో బొరిగుమ్మ నుంచి బీజేపీ నుంచి జిల్లా పరిషత్ సభ్యునిగా గెలుపొందారు. ఆయనతో పాటు బీజేపీ కార్యకర్తలు గోపి పట్నాయిక్, త్రినాథ్ పట్నాయిక్, ఎం.శివ, హృషికేష్ దొలాయ్, శేఖ్ సాలిమ్, గోవర్ధన భూమియ, మును భొత్ర, శేఖ్ రఫి, భగవాన్ హరిజన్, తిలా హరిజన్‌లతో పాటు అనేకమంది కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ కుమార్ గంతాయిత్, కె.సుధాకర్, జిల్లా పరిషత్ సభ్యులు పింకు శతపతి, పి.ధవళేశ్వర్, మను పట్నాయిక్, తపన్ దాస్, కైళాస రథ్, బి.ప్రసాద్ దొర, లండు బేగ్ దొర తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగను పంపిణీ చేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

రాయగడ: స్థానిక ప్రజాపనుల శాఖ కార్యాలయం ప్రాంగణంలో జంఝావతి మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజలకు మజ్జిగను శుక్రవారం పంపిణీ చేశారు. మండుతున్న ఎండలో ప్రయాణిస్తున్న వారికి ఉపశమనం కలిగేలా మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు క్లబ్ అధ్యక్షురాలు అరుణ బెహర, సరస్వతి సాహులు తెలిపారు. క్లబ్ ద్వారా ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు

కృష్ణచంద్ర గజపతికి ఘననివాళి



గజపతి విగ్రహానికి నివాళులర్పిస్తున్న పరిషత్ సభ్యులు

రాయగడ: పర్లాకిమిడి మహారాజ్ కృష్ణచంద్ర గజపతి 132వ జయంతి ఉత్సవాన్ని స్థానిక మహారాజ్ కృష్ణచంద్ర గజపతి కళా, సాంస్కృతిక పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గజపతి కూడలిలోని గజపతి విగ్రహానికి సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పరిషత్ అధ్యక్షులు అమూల్య రత్న సాహు మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా కృష్ణ చంద్ర గజపతి కళా, సాంస్కృతిక పేరిట ప్రారంభమైన పరిషత్ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏటా నిర్వహిస్తున్నామన్నారు. ఒడియా సంస్కృతి, భాష, కళలను పరిరక్షించేందుకు తమవంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. విద్యావేత్త కె.మహాంతి, సత్యవాది పతి, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్ పాల్గొన్నారు.

బస్సులో మంటలు



జాతీయ రహదారి బైపాస్ మార్గంపై మంటల్లో చిక్కుకున్న ప్రయాణికుల బస్సు

భువనేశ్వర్: తాల్చేర్ నుంచి భువనేశ్వర్‌కు బయల్దేరిన ప్రయాణికుల బస్సు ఆకస్మికంగా మంటల్లో చిక్కుకుంది. ఈ సంఘటన శుక్రవారం ఢెంకనాల్ 55వ నంబరు జాతీయ రహదారి కాంటియోలియా ప్రాంతంలో చోటు చేసుకుంది. ప్రయాణికులతో పరుగులు తీస్తున్న బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అదృష్టవశాతు ఈ ప్రమాదంలో ఎలాటి ప్రాణహాని జరగలేదు. ప్రమాదానికి గురైన బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారు. డ్రైవర్ అప్రమత్తతతో ప్రమాదం తప్పింది. మంటలు రాజుకున్న వెంటనే డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి బస్సును ఆపేసి ప్రయాణికులను కిందకు దించేశారు. కాసేపటికే బస్సు మంటల్లో దగ్ధమైపోయింది. సమాచారం అందడంతో ఢెంకనాల్ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. ప్రమాదం కారణంగా ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు తాత్కాలికంగా అంతరాయం ఏర్పడింది. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. షార్ట్ సర్క్యూట్ లేదా టైర్ వేడెక్కడం వల్ల మంటలు చెలరేగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

అతిరథులు వస్తున్నారహో..!

- రాష్ట్రానికి విచ్చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ కీలక నాయకులు
- హోరెత్తనున్న ప్రచారం





భువనేశ్వర్: సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని ప్రధాన రాజకీయ పక్షాల ప్రముఖులు ఒడిశా రాష్ట్రానికి తరలివస్తున్నారు. త్వరలో జరగనున్న తొలి విడత పోలింగు పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఈ నెల 28న రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి విచ్చేస్తున్నట్లు ఆయా పార్టీ వర్గాల సమాచారం. వీరివురు బరంపురం, రాయగడ ప్రాంతాల బహిరంగ సభల్లో ప్రసంగించనున్నారు.

- జె.పి.నడ్డా బరంపురంలో బహిరంగ సభలో ప్రసంగించిన తర్వాత నవరంగపూర్‌లో బీజేపీ కార్యకర్తలతో సమావేశమవుతారని పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సమీర్ మహంతి తెలిపారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో బలహీన స్థానాలపై బీజేపీ దృష్టి సారించింది. ఆయా స్థానాల్లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా రాష్ట్ర పర్యటన కీలక పాత్ర పోషిస్తుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. రాష్ట్రంలో బీజేపీ తన పట్టు కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ నవీన్ పట్నాయక్ కంచుకోటను ఛేదించలేక తల్లడిల్లుతోంది. రాష్ట్రంలో పూర్తి ఆధిక్యతతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ ఉవ్విళ్లూరుతోంది.
- మరోవైపు కాంగ్రెసు రాష్ట్రంలో పూర్వ వైభవాన్ని అంచెలంచెలుగా కూడగట్టుకోవాలని యోచిస్తోంది. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఈ నెల 28న రాయగడలో జరిగే బహిరంగ సభలో ప్రసంగించనున్నట్టు సమాచారం. మే 13న కొరాపుట్ పార్లమెంట్ స్థానానికి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ జిల్లాలో ర్యాలీ నిర్వహిస్తారని నియోజక వర్గ ప్రస్తుత ఎంపీ, కాంగ్రెస్ అభ్యర్థి సప్తగిరి శంకర్ ఉలాకా తెలిపారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించి పూర్తి రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా రాహుల్, ప్రియాంకతో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ భాగేల్ కూడా నియోజకవర్గంలో ప్రచారం చేస్తారని ఉలాకా వివరించారు.

గజపతి నారాయణకు నివాళులు



మహరాజా కృష్ణచంద్ర గజపతి సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి: స్వతంత్ర ఒడిశా నిర్మాత, తొలి ఉత్కళ భాషా రాష్ట్ర వైతాళికుడు, తొలి ఒడిశా ప్రీమియర్ ప్రధాని, మహరాజా శ్రీకృష్ణచంద్ర గజపతి నారాయణ దేవ్ 133వ జయంతిని పర్లాకిమిడి కుమ్మరి వీధిలో గల ఆయన సమాధి వద్ద జిల్లా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ పూలమాలలు వేసి అంజలి ఘటించారు. డీఎఫ్ఓ సుబ్రహ్మణ్యం ఆనంద్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, చెలిగడ జల విద్యుత్ కేంద్రం అధికారి రవీంద్ర కుహోరో, డీఆర్‌డీఏ. ముఖ్య కార్యనిర్వాహణ అధికారి గుణనిధి నాయక్, తహసీల్దార్ నారాయణ బెహరా, జిల్లా సాంస్కృతిక అధికారి, అర్చనా మంగరాజ్ డీపీఆర్ఓ ఉన్నారు. స్థానిక బజారు కూడలి వద్ద మహరాజా గజపతి విగ్రహానికి పూలమాలలు వేసి కలెక్టర్, యువరాణి కళ్యాణీ దేవి గజపతి, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి ఘటించారు. మహరాజా సమాధి వద్ద ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు తన సహచరులతో కలిసి శ్రద్ధాంజలి ఘటించారు.



మహరాజా సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు



మహరాజా సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న అధికారులు



మార్కెట్ కూడలి వద్ద మహరాజా విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్

బీజేడీ నాయకుల పుష్పాంజలి



తాత కృష్ణ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న యువరాణి కల్యాణీదేవి గజపతి



కృష్ణచంద్రగజపతి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: మహారాజ కృష్ణచంద్ర గజపతి నారాయణ దేవ్ 133వ జయంతి సందర్భంగా బీజేడీ పార్టీ నాయకులు ఆయనకు నివాళులర్పించారు. బీజేడీ యువజన ఉపాధ్యక్షులు, పర్లాకిమిడి అసెంబ్లీ అభ్యర్థి రూపేష్ పాణిగ్రాహి మార్కెట్ కూడలి వద్ద ఉన్న కృష్ణచంద్ర విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం గజపతి వంశీయురాలు యువరాణి కల్యాణీ దేవి గజపతి కూడా తాతగారి విగ్రహానికి పూలమాలలు వేశారు. బీజేడీ నాయకులు ప్రదీప్ నాయక్, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, నన్నుపట్నాయిక్, జమీదార్ పట్నాయక్ ఉన్నారు.

కూల్ ఐడియా





ఎండలు మండిపోతున్నాయి. 40 డిగ్రీలకు పైనే పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని సిగ్నల్ కూడళ్ల వద్ద వాహనచోదకులకు ఎండ తగలకుండా గ్రీన్‌మ్యాట్‌లు ఏర్పాటు చేశారు. అరసవల్లి మిల్లు కూడలి, ఏడు రోడ్ల కూడలి, డేఅండ్‌నైట్ కూడలి, రామలక్ష్మణ కూడలి తదితర ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయడంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేశారు.

- అరసవల్లి

ప్రభుత్వ లైవ్ స్టాక్, ఫారెస్టు గార్డు పోస్టులకు రాతపరీక్ష



పర్లాకిమిడి ఐఎస్ఆర్ కాంప్లెక్సులో పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులు

పర్లాకిమిడి: ఎన్నికల వేళ స్థానిక కుమ్మరి వీధి ఐఎస్ఆర్ కాంప్లెక్సులో ఒడిశా సబార్డినేట్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో లైవ్ స్టాక్ ఇన్‌స్పెక్టర్, ఫారెస్టర్, ఫారెస్టు గార్డు పోస్టులకు కంప్యూటర్ పరీక్షను అధికారులు నిర్వహించారు. సాధారణంగా స్థానిక ఎస్.కె.సీ.జీ.కళాశాలలో ప్రభుత్వ సర్వీసు కమిషన్ పరీక్షలు నిర్వహిస్తుంటారు. అయితే కళాశాలలో ఎన్నికల ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు ఉండడంతో కేంద్రాన్ని మార్చారు.

బీజేడీ పార్టీ కార్యాలయం ప్రారంభం

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి హడ్డుభంగి మెయిన్ రోడ్డు మినీ స్టేడియం వద్ద బీజేడీ పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం సాయంత్రం పర్లాకిమిడి బీజేడీ అభ్యర్థి రూపేష్ పాణిగ్రాహి ప్రారంభించారు. కార్యక్రమంలో భరత్ భూషణ్ మహంతి, చోడవరపు లోకనాథం పాల్గొన్నారు. ఫొటోనం.85బి: పార్టీ కార్యాలయం ప్రారంభంలో రూపేష్ పాణిగ్రాహి

ప్రజాసేవకుడు కృష్ణచంద్ర గజపతి



కృష్ణచంద్ర గజపతి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దుర్యోధన్ బోయ హజార్

మల్కన్‌గిరి: ప్రజాసేవకుడు పర్లాకిమిడి మహారాజ్ కృష్ణచంద్ర గజపతి అని వక్తలు అన్నారు. మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని ఎక్స్ బోర్డు పాఠశాలలో కృష్ణచంద్ర గజపతి 133వ జయంతిని జిల్లా ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డు ఉపాధ్యాయులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మల్కన్‌గిరి సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయ హజార్ పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలోని కృష్ణచంద్ర విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

కాశీనగర్ బీజేడీ బ్లాక్ అధ్యక్షుడిగా లోకనాథం



లోకనాథం

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ సమితి బీజేడీ అధ్యక్షులుగా చోడవరపు లోకనాథం, జిల్లా సాధారణ కార్యదర్శిగా అఖిల పాత్రో నియమితులయ్యారు. ఈ విషయాన్ని రాష్ట్ర బీజేడీ సంస్థాగత కార్యదర్శి ప్రణబ్ ప్రకాష్ దాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరి నియామకంపై జిల్లా బిజూజనతాదళ్ పార్టీ అధ్యక్షుడు జగబంధు దాస్ హర్షం వ్యక్తం చేశారు.

ఇచ్ఛాపురం డిగ్రీ కళాశాలకు నాక్-బి గ్రేడ్



ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (నాక్) బి-గ్రేడ్ గుర్తింపునిచ్చిందని ప్రిన్సిపాల్ డాక్టర్ రబీన్‌కుమార్ పాఢీ శుక్రవారం తెలిపారు. ఈ నెల 19, 20వ తేదీల్లో నాక్ చైర్మన్ డాక్టర్ పరమేంద్ర బాజ్‌పాయ్ నేతృత్వంలో కళాశాలను బృందం సందర్శించిన సంగతి తెలిసిందే. గతంలో సి-గ్రేడ్ ఉండేదని, ఇప్పుడు బి-గ్రేడ్ రావడం ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బంది శ్రీనివాసరావు, దుర్యోధన, సంతోకుమార్, శివకుమార్ త్రిపాఠి, నాగేశ్వరరావు, లోకేష్, రాధ, బృందావనం, వరప్రసాద్, మోహన్‌రావు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా రాముడి పట్టాభిషేకం



రాముడి పట్టాభిషేకంలో పాల్గొన్న భక్తులు

జయపురం: పట్టణంలోని జమాల్ వీధిలో గల రామ మందిరం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం ఘనంగా జరిగింది. ప్రముఖ వ్యాపారి మద్ది రామకృష్ణ, మద్ది మోహన్‌రావు సోదరుల ఆధర్వర్యంలో స్వామివారి పట్టభిషేకం చేపట్టారు. ఈ పట్టాభిషేకంలో అనేక మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ పూజారి ఉలిమిరి నాగేశ్వరరావు, పట్టణ పురోహితులు గన్నవరపు వెంకటరమణ స్వామివారి పట్టాభిషేకం జరిపించారు. శ్రీరామ నవరాత్ర కల్యాణ సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలు విజయవంతంగా నిర్వహంచటంలో కమిటీ ప్రతినిధులకు పూర్తిగా సహకరించిన ఉత్తమ కార్యకర్తలను కమిటీ అధ్యక్షుడు జి.నాగరాజు సన్మానించారు.



ఉత్తమ కార్యకర్తలకు సన్మానం

ఘనంగా హనుమద్ సేవ



బాలాజీ సేవా సమితి ఆధ్వర్యంలో హనుమంతుని ఆకు పూజ దృశ్యం



బ్రహ్మోత్సవ మూర్తులకు హనుమద్ వాహన సేవ.

భువనేశ్వర్: ఖుర్దా రోడ్ అకౌంట్సు కాలనీ బాలాజీ మందిరంలో వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవంతో పాటు దేవస్థానం 31వ వార్షికోత్సవం కన్నుల పండువుగా కొనసాగుతోంది. ఈ ఉత్సవాల్లో భాగంగా బ్రహ్మోత్సవ మూర్తులకు నిత్యం సంధ్య వేళలో రోజుకో వాహన సేవ నిర్వహిస్తున్నారు. శుక్రవారం నిత్య సేవాదుల అనంతరం సూర్య నమస్కారాలు, ఉత్సవ విగ్రహ అభిషేకం, కల్యాణ మహోత్సవం ఇతర పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ సముదాయంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రాంగణంలో నిర్వహించిన ఆకు పూజ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అప్రయోజన వ్యాజ్యంపై జరిమానా

భువనేశ్వర్: అప్రయోజిత వ్యాజ్యం దాఖలు చేసి అమూల్య సమయం వృథా చేసిన నేపథ్యంలో పిటిషనర్‌కు రాష్ట్ర హైకోర్టు భారీ జరిమానా వడ్డించింది. 2019 రాజ్యసభ ఎన్నికల సమయంలో రైల్వే మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన అశ్విని వైష్ణవ్ తప్పుడు సమాచారంతో అఫిడవిట్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో తగిన చర్యలు ఆదేశించాలనే అభ్యర్థనతో దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం విచారణకు హైకోర్టు ధర్మాసనం స్వీకరించింది. విచారణ నేపథ్యంలో పిటిషన్‌లో వివరాలు, అంశాల్ని పరిశీలించిన ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ధర్మాసనం సమయం వృథా చేసినందుకు పిటిషనర్‌పై ఒరిస్సా హైకోర్టు రూ.5 లక్షల జరిమానా విధించింది. భువనేశ్వర్‌కు చెందిన కంపెనీ సెక్రటరీ భాగ్యధర్ బెహెరా ఈ పిటిషను దాఖలు చేశారు. దీనిని దాఖలు చేయడం రాజకీయ ప్రేరేపితమైనదిగా కనిపిస్తోందని చీఫ్ జస్టిస్ సి.శరణ్ సింగ్, జస్టిస్ ఎం.ఎస్.రామన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. మూడు వారాల్లోగా హైకోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదుల సంక్షేమ నిధిలో జరిమానా మొత్తాన్ని జమ చేయాలని పిటిషనర్‌ను ధర్మాసనం ఆదేశించింది. అనవసరమైన వ్యాజ్యాలు దాఖలు చేయడం వల్ల అవసరమైన వ్యాజ్యాల విచారణ ప్రక్రియకు అడ్డంకి కాకుండా అవగాహన కల్పించే దృక్పథంతో ఈ జరిమానా విధించినట్లు ధర్మాసనం పేర్కొంది.

నాలుగు రోజులుగా ఇంట్లోనే మృతదేహం

- అనుమానాస్పదంగా మహిళ మృతి
- మెళియాపుట్టిలో ఘటన





ఇంట్లో మృతదేహం (ఇన్‌సెట్లో ప్రభావతి)

మెళియాపుట్టి: మండల కేంద్రం మెళియాపుట్టిలో ఓ మహిళ మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మెళియాపుట్టి ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. మెళియాపుట్టి మెయిన్ రోడ్ పరిసర ప్రాంతంలో గురజాడ ప్రభావతి(46) అనే మహిళ ఒంటరిగా నివాసముంటోంది. భర్త ఇదివరకే మృతిచెందగా.. పెద్ద కుమారుడు రవికుమార్ విశాఖలోని పెద్దమ్మ ఇంటి వద్ద ఉంటున్నాడు. చిన్న కుమారుడు నాని జమ్మూకాశ్మీర్‌లో సీఆర్‌పీఎఫ్ జవానుగా విధులు నిర్వహిస్తున్నాడు. చిన్న కుమారుడు ప్రతిరోజూ తల్లితో ఫోన్‌లో మాట్లాడేవాడు. నాలుగు రోజులుగా ఫోన్ తీయకపోవడంతో శుక్రవారం ఉదయం పక్కింటి వారికి ఫోన్ చేసి చూడమన్నాడు. వారు వెళ్లి చూడగా ఇంటి నుంచి దుర్వాసన వస్తున్నట్లు గుర్తించి విషయం చెప్పారు. వెంటనే ఆయన విశాఖపట్నంలో ఉంటున్న సోదరుడు రవికుమార్‌కు సమాచారం అందించాడు. ఆయన వచ్చి చూడగా తల్లి మృతిచెందినట్టు గుర్తించారు. తీవ్రమైన ఎండ, అనారోగ్య కారణాలతో మృతిచెంది ఉండవచ్చని పోలీసులు, స్థానికులు భావిస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మరణంలోనూ వీడని బంధం



అంత్యక్రియలు జరిపేందుకు వెళ్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు



అమ్ములు ఫైల్



ఏకాశి ఫైల్

ఎల్.ఎన్.పేట: భార్య మృతి చెందిన కొన్ని గంటల్లోనే భర్త సైతం మృతి చెందిన ఘటన ఎల్.ఎన్.పేట మండలం శ్యామలాపురం వంశధార పునరావాస కాలనీలో చోటుచేసుకుంది. నెల్లి అమ్ములు (69) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శుక్రవారం ఉదయం అమ్ములు దహన సంస్కరణకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో భర్త ఏకాశి (77) ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. పక్కకు తీసి పరిశీలించగా మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. దీంతో గ్రామంలో విషాదం అలముకుంది. ఈ దంపతులకు వివాహాలు జరిగిన ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యాభర్తలు మరణించిన సమాచారం తెలుసుకున్న పరిసర గ్రామస్తులు భారీగా తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

జూన్ 29న జాతీయ లోక్ అదాలత్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్ జూన్ 29న నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు ఆమదాలవలస, ఇచ్ఛాపురం, పాలకొండ, పలాస, పాతపట్నం, రాజాం, సోంపేట, టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట, కొత్తూరు, పొందూరు కోర్టుల్లో జరుగుతుందని పేర్కొన్నారు. శుక్రవారం కోర్టు ఆవరణలో జిల్లా పోలీసు అధికారులు, ఇన్సూరెన్స్ అధికారులు, న్యాయాధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్సూరెన్స్ అధికారులు ఎక్కువ సంఖ్యలో మోటారు వాహన ప్రమాద కేసులను రాజీ చేయడం ద్వారా ప్రమాద బాధితులకు తక్షణ సాయం అందుతుందన్నారు. రాజీతో సమయం, డబ్బులు ఆదా అవుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీడీపీ కార్యాలయంపై ఆర్‌వోకు నివేదిక



బోడసింగిపేట రెవెన్యూ పరిధిలో ప్రైవేటు స్కూలు, కాలేజీకి ఆనుకుని ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయం

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేట గ్రామ రెవెన్యూ పరిధిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయానికి సంబంధించి నివేదికను గజపతినగరం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందచేసినట్లు ఎంపీడీవో ఎస్.హరిహరరావు తెలిపారు. గ్రామ రెవెన్యూ పరిధిలో ఒక ప్రైవేటు స్కూల్‌తో పాటు ప్రైవేటు కళాశాలకు మధ్య నిబంధనలకు విరుద్ధంగా 100 మీటర్లు లోపున రెండింటికి సంబంధించిన ఆట స్థలం ఆవరణంలో ఏర్పాటు చేసినట్లు గుర్తించామని తెలిపారు. దీనికి సంబంధించి క్షేత్ర స్థాయిలో పరిశీలించి తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేసినట్లుగా గుర్తించి నివేదికను అందజేశామని తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం 100 మీటర్లు దాటిన తర్వాతనే ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు, కాలేజీలు, దేవాలయాలు పరిధిలో ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. కొద్ది రోజుల కిందట టీడీపీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు గుర్తించి నివేదికను ఆర్‌వోకు అందజేశామని చెప్పారు.

యువకుడి ఆత్మహత్య

బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లికి చెందిన బోగాది రాజేష్(18)ప్రేమ విఫలమై గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఈ నెల 23న మధ్యాహ్నం గడ్డి మందు తాగినట్టు గుర్తించిన తల్లిదండ్రులు సత్యనారాయణ, గౌరి బొబ్బిలి సీహెచ్‌సీ అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చదలవాడ తెలిపారు.

రూ.ఆరున్నర కోట్ల ఆభరణాలు పట్టుకున్న పోలీసులు

డెంకాడ: మండలంలోని మోదవలస వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో భాగంగా రూ.ఆరున్నర కోట్ల విలువైన బంగారు, వెండి ఆభరణాలను పట్టుకున్నట్టు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. విశాఖ వైపు నుంచి విజయనగరం వైపు వస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా అందులో సుమారు 10 కేజీల బంగారు, 17 కేజీల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. వీటికి సరైన పత్రాలు చూపకపోవడంతో సీజ్ చేసి, ఐటీ అధికారులకు సమాచారం అందించినట్టు తెలిపారు.

ఓపెన్ టెన్త్ ఫలితాల్లో 6 స్థానం

పార్వతీపురంటౌన్: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం పదోతరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు డీఈఓ జి. పగడాలమ్మ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పదోతరగతి ఫలితాల్లో రాష్ట్రంలో మన్యం జిల్లా 6స్థానంలో నిలవగా ఇంటర్మీడియట్ ఫలితాల్లో 12వ స్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలో 680మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా 531మంది ఉత్తీర్ణులై 78.09శాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. అలాగే ఇంటర్మీడియట్‌లో 465మందికి గాను 291మంది హాజరూ 62.58శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

మేధో సంపత్తి హక్కులపై అవగాహన అవసరం

విజయనగరం అర్బన్: మేధో సంపత్తి హక్కులు, స్టార్టప్‌లపై విద్యార్థులకు అవగాహన పెరగాలని నవల పేటెంట్ సర్వీసెస్ చీఫ్ రిసోర్స్‌పర్సన్ జి.స్వామి అన్నారు. స్థానిక సీతం కళాశాలలో మేధో సంపత్తి మేనేజ్‌మెంట్ అనే అంశంపై శుక్రవారం జరిగిన ఒక రోజు సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావేత్తలు, పరిశ్రమల మధ్య మేధో సంపత్తి హక్కులు వారధిగా పని చేస్తుందని భారతదేశానికి మరిన్ని ఆవిష్కరణలు అవసరమని పేర్కొన్నారు. మేధో సంపత్తిని ప్రోత్సహించడం, రక్షించడం యొక్క ఆవశ్యకతను మరియు విలువైన వ్యాపార ఆస్తి అని అన్నారు. దేశంలోని ఎంఎస్ఎంఈలు తమ మేధో సంపత్తి ఆస్తులను రక్షించుకోవాలని నొక్కి చెప్పారు. అనంతరం ముఖ్య అతిథిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీతం కాలేజ్ డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, హెచ్ఓడీ డాక్టర్ ఎస్ వరూధిని, డీన్ డాక్టర్ వై.నరేంద్ర, డీన్ సీతాం, ఐపీసీ కోఆర్డినేటర్లు, మేనేజ్‌మెంట్ స్టడీస్ ఫ్యాకల్టీ, విద్యార్థులు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

చెక్‌పోస్టు పరిశీలన

బలిజిపేట: మండలంలోని వెంగాపురం సంత తోట వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు రమాకాంత్ శుక్రవారం పరిశీలించారు. రోజువారీ వచ్చిపోయే వాహనాల వివరాలు, వాహనాలను ఏ విధంగా పరిశీలిస్తున్నది, ఇంతవరకు పరిశీలన ఏ విధంగా చేశారన్నది రికార్డుల నమోదు వంటి అంశాలను పరిశీలించారు. అక్కడ ఉన్న సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతన్నకు యంత్ర దన్ను



- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 335 ట్రాక్టర్లు అందజేత
- వీటి మొత్తం విలువ రూ.44.93 కోట్లు
- ప్రభుత్వం ఇచ్చిన రాయితీ రూ.14.33 కోట్లు
- టీడీపీ హయాంలో కార్యకర్తలకే రైతు రథం ట్రాక్టర్లు

విజయనగరం ఫోర్ట్:

ఆరుగాలం శ్రమించి అందరికీ అన్నంపెట్టే రైతన్నకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలిచింది. 58 నెలల పాలనలో రైతన్నకు వెన్నుదన్నుగా నిలబడింది. రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి సాగు సూచనలు అందించేందుకు ప్రత్యేక వ్యవసాయ సిబ్బందిని నియమించింది. విత్తన సరఫరా నుంచి పంట కొనుగోలు వరకు ఉత్తమ సేవలందించింది. మరోవైపు వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయంగా ఏటా రూ.13,500 రైతుల ఖాతాలకు సీజన్‌ల వారీగా జమచేసింది. సాగును సులభతరం చేస్తూ యంత్ర సాయం అందించింది. విపత్తుల సమయంలో ఆదుకునేలా రైతన్న తరఫున ప్రభుత్వమే వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద ప్రీమియం చెల్లించింది. దేశానికి, రాష్ట్రానికి రైతన్నే వెన్నెముకగా భావించి, వారి సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగింది. అందుకే.. ఏ రైతును అడిగినా సాగుసాయం అందిందంటూ ధీమాగా చెబుతున్నారు. వ్యవసాయ రంగంలో సరికొత్త విప్లవాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని పేర్కొంటున్నారు.

రైతు గ్రూపులకు 335 ట్రాక్టర్ల కేటాయింపు

జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద ట్రాక్టర్లు, వివిధ సాగు పరికరాలను రాయితీపై రైతులకు సమకూర్చింది. ఆర్‌బీకేలు వేదికగా ప్రతీ ఐదుగురు రైతులతో గ్రూపును ఏర్పాటుచేసి సాగులో అవసరమైన పవర్ టిల్లర్లు, ట్రాక్టర్లు, దుక్కిసెట్లు, దమ్ముసెట్లు, స్ప్రేయర్లు, రోటావేటర్లు వంటి యంత్ర పరికరాలను రాయితీపై అందజేసింది. 2019 నుంచి ఇప్పటి వరకు వైఎస్సార్ యంత్ర సేవ ఫేజ్-1లో 326 గ్రూపులకు 212 ట్రాక్టర్లు, ఫేజ్-2లో 184 గ్రూపులకు 123 ట్రాక్టర్లు సమకూర్చింది. మొత్తంగా 510 గ్రూపులకు 335 ట్రాక్టర్లు అందజేసింది. వీటి విలువ రూ.44.93 కోట్లు కాగా ప్రభుత్వం రూ.14.32 కోట్లు రాయితీ కల్పించింది. సాగును సులభతరం చేసింది. టీడీపీ హయాంలో 2014 నుంచి 2019 మధ్య ఉమ్మడి విజయనగరం జిల్లాలో రైతు రథం కింద 320 ట్రాక్టర్లను సమకూర్చింది. అయితే, ఇవి టీడీపీ కార్యకర్తలు, నాయకులకే అందజేసింది. ప్రభుత్వ రాయితీపై అందజేసిన ట్రాక్టర్లను కొందరు సొమ్ముచేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ట్రాక్టర్ల కోసం కొన్నిచోట్ల జన్మభూమి కమిటీ సభ్యులు రూ.30వేల నుంచి రూ.40వేలు వరకు వసూలు చేసినట్టు సమాచారం.

రైతులు కోరిన ట్రాక్టర్...

రైతులు కోరిన ట్రాక్టర్లనే ప్రభుత్వం అందజేసింది. మహీంద్రా, స్వరాజ్, ఐసర్, టఫే, జాన్‌డీర్, ఇండోఫామ్, సోనాలిక, వీఎస్‌టీ, ఎస్కార్ట్ వంటి కంపెనీలకు చెందిన ట్రాక్టర్లను రైతులు ఎంపిక చేసుకోగా, వాటినే సమకూర్చింది.

ట్రాక్టర్ సమకూర్చింది



నాతో పాటు మరో నలుగురు రైతులం కలిసి గ్రూపుగా ఏర్పడ్డాం. ట్రాక్టర్ కోసం దరఖాస్తు చేశాం. మా గ్రూపునకు ట్రాక్టర్ ఇచ్చారు. మా గ్రూపు సభ్యులతో పాటు మా గ్రామానికి చెందిన రైతుల సాగు అవసరాలకు వినియోగిస్తున్నాం. సాగు సులభతరమైంది. ఒక్కరూపాయి లంచం లేకుండా... రైతుభరోసా సిబ్బంది సమక్షంలో చేసుకున్న దరఖాస్తు మేరకు ట్రాక్టర్ మంజూరైంది. ప్రభుత్వం మేలు మరచిపోలేనిది.

– చప్పు లక్ష్మునాయుడు, రైతు, పెదవేమలి

రూ.15.20 కోట్ల విలువ చేసే ఇతర పరికరాలు

రైతులకు ట్రాక్టర్లతో పాటు సాగుకు ఉపయోగపడే ఇతర యంత్ర పరికరాలను ప్రభుత్వం సమకూర్చింది. వైఎస్సార్ యంత్ర సేవ ఫేజ్-1లో రూ.13.19 కోట్లు, ఫేజ్-2లో రూ.6.53 కోట్లు విలువైన యంత్ర పరికరాలను రూ.6.23 కోట్ల రాయితీపై అందజేసింది.

వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద సాగుపరికరాల మంజూరు ఇలా..

యంత్రం	గ్రూపుల సంఖ్య	యంత్రాల సంఖ్య	వాస్తవధర	రాయితీ
ఫేజ్-1లో..				
ట్రాక్టర్లు	326	212	రూ. 29.73 కోట్లు	రూ. 9.78 కోట్లు
ఫేజ్-2లో..				
ట్రాక్టర్లు	184	123	రూ.15.20 కోట్లు	రూ.4.54 కోట్లు

బొబ్బిలిలో సీఎం సభను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న రీజనల్ డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

- కార్యకర్త నుంచి నాయకుల వరకు బాధ్యత తీసుకోవాలి
- మే 1 ఉదయం 10 గంటలకు బొబ్బిలికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి
- వైఎస్సార్ సీపీ డిప్యూటీ జోనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

బొబ్బిలి: వచ్చేనెల 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయంలో బొబ్బిలి పాత్ర ఉండాలని, మే 1న ఇక్కడ నిర్వహించనున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభను విజయవంతం చేద్దామని పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు వైఎస్సార్ సీపీ డిప్యూటీ జోనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బొబ్బిలి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బొబ్బిలిలో 15 సంవత్సరాలు పరిపాలించిన వారు ఏం చేశారో ఏం చేస్తారో చెప్పకుండా.. తమను చూసి ఓటేయమని అడగడం సిగ్గు చేటన్నారు. నాయకుల దగ్గర నుంచి ప్రజల వరకు అందరూ ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ రావాలని కోరుకుంటున్నారన్నారు. విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధి పనులతో జనం గుండెల్లో జగన్ స్థానం సంపాదించారన్నారు. ప్రస్తుత ఎన్నికలు శంబంగి గెలుపు కోసం, సీఎం జగన్ గెలుపు కోసం మాత్రమే కాదని, ప్రజల జీవన ప్రమాణాల స్థిరత్వం కోసమని ప్రతీ ఒక్కరూ గ్రహించాలన్నారు. మే1న ఉదయం 9 గంటలకు ప్రజలందరూ సీఎం సభా వేదిక వద్దకు చేరుకునేలా వైఎస్సార్‌సీపీ నాలుగు మండలాల నాయకులు, పట్టణ నాయకులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ముందుగానే అన్ని సిద్ధం చేసుకుని సీఎం సభా ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలన్నారు.

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఈ నెల 24వరకు జరిగిన 'మేమంతా సిద్ధం' సభలను మించిపోయేలా బొబ్బిలి ఎన్నికల ప్రచార బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతీ గ్రామం నుంచి జగనన్న ప్రభుత్వంలో లబ్ధి పొందిన వారంతా సభకు వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తారన్నారు.
- బొబ్బిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకుడు మావుడి శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, పట్టణంలోని 31 వార్డుల నుంచి ప్రజలు సభాస్థలికి నిర్ణీత సమయంలో చేరేలా ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు చర్యలు తీసుకోవాలని కోరారు. పెద్ద సంఖ్యలో హాజరై ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుదామన్నారు.
- మాజీ మంత్రి పెద్దింటి జగన్మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలనా సామర్థ్యాన్ని చూసిన జనం తప్పకుండా ఆయనను చూసేందుకు మళ్లీమళ్లీ వస్తారన్నారు. సంక్షేమ పాలన అందించడంలో జగన్‌ను మించిన వారు లేరని, ఆయన పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేద్దామన్నారు. రాష్ట్ర ఆర్థిక మండలి మాజీ సభ్యుడు తూముల భాస్కరరావు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటి గోపాల రావు, వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బొత్స కాశినాయుడు, నాలుగు మండలాల జేసీఎస్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

పాలకొండలో అగ్నిప్రమాదం



ఘటనా స్థలంలో మంటలను అదుపుచేసేందుకు యత్నిస్తున్న ఫైర్ సిబ్బంది, స్థానికులు

పాలకొండ రూరల్: స్థానిక పాతబస్టాండ్ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. అక్కడికి సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పక్షి వాలడంతో నిప్పు రవ్వలు ఎగసిపడి దిగువనగున్న పూరిపాకలపై పడడంతో ఈ ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు తెలిపారు. ఈ ఘటనలో అరుణ ట్రావెల్స్, సాయిమహేష్ ట్రాన్స్‌పోర్టు, ఎచ్చెర్ల లక్ష్మిలకు సంబంధించిన పూరిపాకలు, ట్రావెల్స్ ఆఫీసులు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతోపాటు ఆఫీస్ ఫర్నిచర్ తదితర పరికరాలు పూర్తిగా కాలిపోవడంతో రూ.2లక్షల 50వేల ఆస్తినష్టం జరిగి ఉంటుందని అధికారులు అంచనావేశారు. సమాచారం మేరకు అగ్నిమాపక శకటంతో అధికారులు, సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ప్రస్తుత వేసవిలో ఈ తరహా ప్రమాదాల నివారణపై అవగాహన పెంచుకోవాలని అగ్నిమాపక అధికారులు ఈ సందర్భంగా సూచించారు.

నగదు పట్టివేత

భోగాపురం: మండల కేంద్రం భోగాపురంలో ముక్కాం కూడలి వద్ద శుక్రవారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేసే సమయంలో ఎటువంటి ఆధారాలు లేకుండా నగదు తరలిస్తున్న పూసపాటిరేగ మండలం కోనాడ గ్రామానికి చెందిన మహదాసు ఆదినారాయణ నుంచి లక్ష రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు. అతని కారును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం

- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు

విజయనగరం అర్బన్: జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి తెలిపారు. జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు హనీష్ చాబ్రా, తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా, పోలీస్ పరిశీలకుడు సచీంద్ర పటేల్‌కు జిల్లాలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఎం.దీపిక వివరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా జిల్లాలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల తీరును వివరించారు. జిల్లాలోని ఓటర్లు, నియోజకవర్గాలు, ఎన్నికల సిబ్బంది సమీకరణ, వారికిచ్చిన శిక్షణ, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన, సున్నిత పోలింగ్ కేంద్రాలు, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకున్న చర్యలు, స్వీప్ కార్యక్రమం, ఈవీఎంలు, సిబ్బంది ర్యాండమైజేషన్, ఓటర్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్ ఏర్పాటు, మోడల్ కోడ్ అమలు, ఎంసీఎంసీ తదితర అంశాలను వివరించారు. ఎస్పీ ఎం.దీపిక మాట్లాడుతూ జిల్లాలో పోలీస్ బందోబస్తు, నిఘా బృందాలు, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు కచ్చితంగా పాటించాలని పరిశీలకులు హనీష్ దాబ్రా, తలాత్ పర్వేజ్ సూచించారు. ఎన్నికలకు సమయం తక్కువగానే ఉందని, ఏర్పాట్లు ముమ్మరం చేయాలన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటర్ స్లిప్పులను పూర్తి వివరాలతో శతశాతం పంపిణీ చేయడం ద్వారా పోలింగ్ శాతం పెరుగుతుందన్నారు. కోడ్ ఉల్లంఘన ఘటనలపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి కెమేరాలు, సెల్ ఫోన్లను అనుమతించవద్దని స్పష్టం చేశారు. హోమ్ ఓటింగ్‌లో ఓటరు రహస్యంగా ఓటు వేసే అవకాశాన్ని కల్పించాలని, కంపార్ట్‌మెంట్‌లో ఓటు వేస్తున్నప్పుడు వీడియో రికార్డింగ్ చేయకూడదని చెప్పారు. అధికారులు, సిబ్బంది నిబద్ధతతో ఎన్నికల విధులను నిర్వహించాలని, ప్రశాంతంగా, పారదర్శకంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. పోలీసు పరిశీలకులు సచింద్ర పటేల్ మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జేసీ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఆర్వో ఎస్.డి.అనిత, వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఫిర్యాదుల కోసం..

జిల్లాలో ఎన్నికల నిర్వహణలో భాగంగా విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పోలీస్ బందోబస్తు వ్యవహారాల పర్యవేక్షణ కోసం ఎన్నిక కమిషన్ సచీంద్ర పటేల్‌ను నియమించింది. ఆయన నగరంలో కంటోన్మెంట్ ప్రాంతంలో ఉన్న పోలీస్ గెస్ట్‌హౌస్‌లో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారు. పోలీస్ పరిశీలకులను ప్రజలు నేరుగా కలిసి గానీ, మొబైల్ నంబర్ (70751 96069)కు గాని ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.

కుదేలవుతున్న కూటమి

- టీడీపీకి మద్దతు ఉపసంహరించుకున్న జనసేన ఇన్‌చార్జి రాజు
- వైఎస్సార్‌సీపీలోకి క్యూ కట్టిన టీడీపీ మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు



మొగిలివలస గ్రామానికి చెందిన టీడీపీ మాజీ ఎంపీటీసీ మురళీనాయుడు వైఎస్సార్‌సీపీలో చేరుతున్న దృశ్యం (ఫైల్)

రాజాం: సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ రాజాం ప్రతిపక్ష కూటమిలో అలకలు, నైరాశ్యాలు మొదలయ్యాయి. వైఎస్సార్‌సీపీ ప్రధాన ఎన్నికల అస్త్రాలు సంధించక ముందే కూటమి ఇక్కడ కుదేలయ్యే పరిస్థితి ఏర్పడింది. కూటమికి చెందిన జనసేన, టీడీపీ ప్రధాన నేతలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. రాజాం నియోజకవర్గంలో ఐదేళ్లుగా జనసేన పార్టీ ఇన్‌చార్జిగా ఎన్ని రాజు పార్టీకి సేవలందించారు. సొంతంగా కొంత ఓటు బ్యాంకు కలిగిన రాజు ఇప్పుడు కూటమి అభ్యర్థి కోటలో కనిపించడం లేదు. కూటమి అభ్యర్థిగా కోండ్రు మురళీమోహన్‌ను ప్రకటించిన ఒకటి రెండు రోజులు అక్కడి సమావేశాల్లో కనిపించిన ఆయన తరువాత కోండ్రు కనీస గౌరవం ఇవ్వడం లేదని ప్రచారానికి దూరమయ్యారు. కోండ్రును వ్యతిరేకిస్తూ ఈ నెల 25న నామినేషన్ కూడా దాఖలు చేశారు. ఈ క్రమంలో జనసేన పార్టీ కార్యకర్తలు పలువురు వైఎస్సార్‌సీపీలో చేరిపోయారు.

దెబ్బ మీద దెబ్బ..

టీడీపీకి అంతోఇంతో పట్టున్న రాజాం పట్టణంలోని బుచ్చింపేట, మొగిలివలస, హరిజన వీధి, కొండంపేట, డోలపేట, మారుతీనగర్, లచ్చయ్యపేట గ్రామాల్లోని టీడీపీ, జనసేన క్యాడర్ మెల్లగా వైఎస్సార్‌సీపీలో చేరిపోయింది. మండలంలో మొగిలివలస, బొద్దాం, మారేడుబాక, ఒమ్మి, గార్రాజుచీపురుపల్లి, రాజయ్యపేట గ్రామాల నుంచి టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. గత ఎన్నికల్లో టీడీపీకి ప్రధాన నేతలుగా వ్యవహరించిన రాజాం మండలం మొగిలివలసకు చెందిన మాజీ ఎంపీటీసీ లెంక మురళీనాయుడు, మారేడుబాకకు చెందిన దుప్పలపూడి నాగేశ్వరరావుతో పాటు ఒమ్మి, కంచరాం, నందబలగ, గార్రాజుచీపురుపల్లి, రాజయ్యపేట గ్రామాలకు చెందిన కొంత టీడీపీ క్యాడర్ వైఎస్సార్‌సీపీలో చేరింది. సంతకవిటిలో కృష్ణంవలస పంచాయతీకి చెందిన మాజీ వైస్ ఎంపీపీ గంధ్రేటి కేసరి, కేఆర్‌పురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పందు రాజుగోపాలనాయుడు, సంతకవిటికి చెందిన గుర్రాల జగన్మోహనరావు, ఎస్.రంగరాయపురానికి చెందిన ఇనుమల మురళీకృష్ణ, సురవరానికి చెందిన మాజీ ఎంపీటీసీ చాపా లక్ష్మణరావు కూడా టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిపోయారు. రేగిడి మండలంలో అప్పాపురం సర్పంచ్ కరణం శ్రీనివాసరావు, లక్ష్మీపురానికి చెందిన సర్పంచ్ కెంబూరీ వెంకటేశ్వరరావు, అంబఖండికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ లావేటి వెంకటవేణుగోపాలనాయుడు, ఖండ్యాంకు చెందిన మాజీ వైస్ ఎంపీపీ గొలివి జగ్గనాయుడు, కందిశకు చెందిన సర్పంచ్ కెల్ల మన్మధరావు, పెద్దశిర్లాం సర్పంచ్ లెంక రాంబాబు, లింగాలవలస సర్పంచ్ గొర్జాన అప్పలనాయుడు, కొండవలసకు చెందిన నేతలు ఇప్పుడు వైఎస్సార్‌సీపీలో ఉన్నారు. ఇటీవల ఉనుకూరుకు చెందిన టీడీపీ నేత తెంటు కృష్ణమూర్తినాయుడు, రేగిడికి చెందిన పలువురు టీడీపీ నేతలు వైఎస్సార్‌పీలో చేరారు. వంగర మండలం కొండచాకరపల్లికి చెందిన ఉపసర్పంచ్ బెవర మురళీకృష్ణ, బెవర శ్రీనివాసరావు, కొరటాన అప్పలస్వామి తదితరులు, రాజులగుమ్మడకు చెందిన ఆలుబెల్లి సుదర్శనరావు, పూడి జనార్ధనరావు, శివ్వాంకు చెందిన టీడీపీ మాజీ అధ్యక్షులు, ప్రస్తుతం సర్పంచ్ బొక్కేల సత్యంనాయుడు తదితరులు అంతా ఇప్పుడు వైఎస్సార్‌సీపీలో ఉన్నారు. వీరంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి వచ్చారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ భారీ విజయమే లక్ష్యంగా వీరంతా పని చేస్తున్నారు. దీంతో కూటమి కకావికలమవుతోంది.

నేడు పాలిసెట్–2024 ప్రవేశ పరీక్ష

- జిల్లాలో 24 కేంద్రాల్లో పరీక్ష రాయనున్న 8,868 మంది విద్యార్థులు



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

విజయనగరం రూరల్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం శనివారం నిర్వహించే పాలిసెట్-2024 ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలోని రెండు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, 17 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. ఆయా పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు జిల్లా వ్యాప్తంగా 24 కేంద్రాల్లో నిర్వహించే ప్రవేశ పరీక్షకు 8,868 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

మూడు చోట్ల పరీక్ష కేంద్రాలు


గతేడాది 9,342 వేల మంది ప్రవేశ పరీక్షకు హాజరు కాగా మూడు ప్రాంతాల్లో 30 పరీక్ష కేంద్రాలను కేటాయించారు. ఈ ఏడాది 8,868 మంది దరఖాస్తు చేయడంతో 6 కేంద్రాలను తగ్గించి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. విజయనగరం పట్టణ పరిధిలో 11, బొబ్బిలిలో 7, గజపతినగరంలో 6 కేంద్రాలను ఏర్పాటు చేశారు. విజయనగరంలోని 11 కేంద్రాల్లో 4,509 మంది, బొబ్బిలిలో 2,346 మంది, గజపతినగరంలో 2,009 మంది పరీక్షకు హాజరు కానున్నారు.

ప్రవేశ పరీక్ష ఉదయం 11 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంటకు ముగియనున్నది. పరీక్షల నిర్వహణకు 450 మంది ఇన్విజలేటర్లు, 25 మంది అబ్జర్వర్లను నియమించారు. విద్యార్థులను ఉదయం 10 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 11 గంటలు దాటి ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించేది లేదని అధికారులు స్పష్టంచేశారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ఒక గుర్తింపు కార్డు తీసుకురావాలని అధికారులు కోరారు.

120 మార్కులకు ప్రవేశ పరీక్ష

ప్రవేశ పరీక్ష ప్రశ్న పత్రం 120 మార్కులకు కాగా గణితం సబ్జెక్టులో 50 మార్కులకు 50 ప్రశ్నలు ఉండగా, ఫిజిక్స్‌లో 40 ప్రశ్నలకు 40 మార్కులు, కెమిస్ట్రీలో 30 ప్రశ్నలకు 30 మార్కులతో పరీక్ష నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి



పాలిసెట్-2024 ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేశాం. పాలిసెట్ పరీక్షకు అనూహ్యంగా దరఖాస్తులు పెరగడంతో పరీక్ష కేంద్రాలను అదనంగా కేటాయించాం. మూడు ప్రాంతాల్లో 24 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నాం. విద్యార్థులను ఉదయం 10 గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తాం. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు ఇబ్బందులు పడకుండా మౌలిక సదుపాయాలు కల్పించాం.

– జి.ఆశారమణి, జిల్లా కన్వీనర్, ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, విజయనగరం